# మగాడి మనసు

నలుగురు స్నేహితుల్ని పోగేసుకొని కిళ్ళీ కొట్టు దగ్గర పిప్పర్మెంట్లు చపర్చిస్తూ చర్చలుసాగి స్తున్న రవణ, ఎదురుగా రిక్షాలో వస్తున్న రింగులమ్మాయిని చూసి — అలానే కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు !



అదేసమయంలో కాకతాళీయంగా అటు వేపు తిరిగి చూసిన కౌసల్య రమ, ఇచ్చిన పోజుకి ఆశ్చర్యపోతూ 'ఇతనికి ఆడాళ్ళని తేరిపారి చూట్టం కూడా తెలుసా ?' అనుకుంది. అనుకుంటూనే నవ్వుకుంది. నవ్వుకొని వూరుకోవాల్సిన నవలామణి మస్తిష్కంలో రిక్షాచక్రభ్రమణంలా భావభ్రమణం ఉద్వేగంతో తారాస్థాయి నందుకుంది.

కిళ్ళీకొట్టుదగ్గర వాళ్ళంతా కలసికట్టుగా తన గురించి ఏమనుకుంటున్నారో- రిక్షా దిగివెళ్ళి- వినాలనిపించింది.

'మీ మరదల్రోయ్' అనొకడూ

'కాబోయే భార్యాలలామ' అనిమరొకడూ జోక్స్ విసుర్తారు !

ఇడియట్స్ ! రమణ పళ్ళికిలిస్తాడు !.... ఎంతయినా పల్లెఘటం.... ఈనాడు పట్నాల కొచ్చి కాలేజీ చదువులు వెలగబెట్టేమటుకు మేనర్స్. కల్చర్ వంట బట్టేస్తాయా ? పుట్టుకతో రావాలిగాని !

'కుడేపికి తిప్పంటారేంటమ్మగారూ ?'

రిక్షావాడి కేకకి ఉలిక్కిపడింది.

'ఊఁ'

పోలీస్‌స్టేషన్ పక్క- వీధిలోకి రిక్షా మళ్ళింది....

స్నానానంతరం నిలువుటద్దం ముందు కూచుని జడ అల్లుకుంటూంటే మళ్ళా రమణ దృష్టే జ్ఞాపకమొచ్చింది!

అబ్బ ! ఆడాళ్ళని చూడగానే ఈ మగ మహారాజులకి అంత వికృతదృష్టి ఎలా వచ్చేస్తుందో మరి ! వళ్ళంతా కళ్ళుచేసుకొని మరీ శల్యపరీక్షలారంభిస్తారు !

అసలు రవణ తన్నెందు కలా చూశాడు? ఆశ్చర్యమా? పలకరింపా? సాంకేతికార్థాలేమైనా ప్రదర్శిస్తున్నాడా?—— 'రానీయ్! ఈవాళ అడిగేస్తా' ననుకుంది.

అనుకుంటూండగానే అరిగిన చెప్పుల చప్పుడు వినిపించింది. కౌసల్య గుండెల్లో రాయిపడ్డంత పనైంది. ఆ చప్పుళ్లో ఏవో చిత్రాతి చిత్రమైన గణగణ వుందని ఆమె అనుమానం. కాకపోతే, ఇంతవరకూ నిల దీసి అడగాలనుకున్న ఆవిడను, తీరాఅతను ఎదురయ్యేసరికి శరీరంలోని రక్తమంతా పాదాల్లోకి పోయి వళ్ళంతా చెమటలు పట్టడమేమిటి?

రవణ ఆ చిరిగిపోయిన చెప్పుల్ని ఈడ్చుకొంటూ ఆమె గది దాటాడు. అలా ప్రొద్దుటా, సాయంకాలం, రాత్రీ — తన చిత్తం వచ్చినపుడల్లా ఆ గది ముందరగానే వెళుతూవుంటాడు; కాని ఎప్పుడూ ఆ గది వేపుగానీ, లోపలకుగానీ చూడడు. ఎందుకో? లోపల ఏముందో అని గానీ, తను ఏం చేస్తున్నానో అన్న ధ్యాసగానీ అతనికి కలగదా? స్వార్థమా ఈ మనిషికి-అనుకునేది.

కాని ఈవాళ తప్పక చూస్తాడనుకుంది. అదే సమయానికి తనూ యథాలాపంగా చూసినట్టు కనురెప్పలెత్తి చూడా లనుకుంది. కాని తను ఆశించినట్టు జరక్కపోయేసరికి తల నరికినట్టే బాధపడింది! ఎంత నిర్లక్ష్యం?

మర్నాడు సాయంకాలంకూడా తను అదే దారిన రిక్షామీద వచ్చింది. అదే కిళ్ళీకొట్టు దగ్గర రవణ మిత్రబృందంతో సహా పిప్పర్మెంట్లు చప్పరిస్తున్నాడు. దగ్గరపడ్డ రిక్షా వేపు సిన్నట్లానే కాకతాళీయంగా చూసి ఆశ్చర్యాన్నభినయించాడు.

ఒకనాడు రవణా వాళ్ళూ కనిపించలేదు. దూరంనించి కిళ్ళీకొట్టుని రెప్ప వాల్చకుండా చూస్తున్న కౌసల్య దృష్టి చుట్టూ ఇరవై గజాల వ్యాసాన్నీ; టూ-పై-ఆర్ పరిధినీ; పై-ఆర్-స్క్వేర్ వైశాల్యాన్నీ గబగబా వెతికేసింది.

అప్రయత్నంగా నోట్లోనుంచి మాటలు పొడిగా, కంగారుగా రాలాయి:

'కాస్త నిమ్మళంగా పోనీయ్'

వన్ఎమ్.పి.హెచ్‌కి తగ్గింది రిక్షావేగం.

కౌసల్య ఆతృత తగ్గలేదు. వీళ్ళంతా ఎక్కడికి పోయారు? మజిలీ మార్చేసుంటారా? 'ఫూల్స్' అని శపించుకుంది .... ఎందుకలా శపించుకుందో తనకే తెలీదు.

'ఇహ వేగంగా పోనీయ్' అంది.

రిక్షా రెగ్యులేటర్ 'ఎత్తాడు'. డీలక్స్‌తో పందెం వేసినట్టు పోతోంది.

కౌసల్య ఉద్వేగం ఉద్విగ్నమయింది. 'ఇడియట్స్' అనుకుంది మళ్ళా. ఆమెకు యేడుపొచ్చినంత పనైంది. రోజూ తనసెంతో ఆప్యాయంగా పలకరించేట్టు నిలబడే మిత్రబృందం ఈవేళ తనకి కావాలనే ద్రోహం చేశారనిపించింది.

ఇంటికి వెళ్ళి స్నానం ముగించి డాబా మీద కూచున్నాకకూడా భావోద్వేగం చల్లార లేదు. గోదావరి మీదినించి పరుగుల్తో వస్తున్న పవన కుమారుల కోమలగీతాలు కూడా ఆమెను ఓదార్చలేకపోయాయి.

భోజనాలయ్యాక తన గదిలోకి వెళ్ళి లైటు వేసింది.

ఈవాళ చింకిచెప్పుల చప్పుడు వినిపించినట్టులేదు. రవణ యింకా యింటికి తిరిగి



రాలేదా?.... అనుమానం కలగడం తరవాయి, గప్పునలేచి వంటింటి వేపువెళ్ళింది.

వంటిల్లు పక్కనే రవణ గది గొళ్ళెం పెట్టి వుంది. తీసుకొని లోపలికి వెళ్ళాలనిపించింది.

గుండె భారంగా మారిపోయింది ఈ భావంతో. ఛీ! పరాయివాడి గదిలోకి తను వెళ్ళడమేమిటి?

రవణ పరాయివాడా? స్వయాన తన మేనత్తకొడుకు.... నాన్న దయాదాక్షిణ్యాల మీద ఈ పట్నం చదువులు వెలగబెడుతున్న బదనిక: అతని ప్రతి వస్తువుమీద తనకు హక్కుంది.

భళ్లున తలుపు తెరచుకొని లోపలికి వెళ్ళింది. గదంతా చీకటి. స్విచ్‌కోసం కాసేపు కుస్తీపట్టి 'ఆన్' చేసింది.

పదిహేనువాట్ల బల్బు ఆవులిస్తూ లేచి గదిని బద్ధకంగా పలకరించింది. ఆ మసక వెల్తుర్లో గది గోడలు భూతాల్లా అగుపించాయి. వంటిల్లు పక్కనే వుండేమో, పొగంతా గదిని కావలించుకొని నిద్రపోతోంది మత్తుగా. ఓ మూలగా ఒక చాపా, ఒక బీసీనాటి తలగడా, దుప్పటీ; కిటికీ ఊచకూ గోడకూ తాడుకట్టి అందుమీద తోరణాల్లా వేలాడే రెండు మూడు పాత గుడ్డలూ, వో మూలగా పుస్తకాలకొంతరా, ఇక్ష్వాకులకాలంనాటి చిన్న ట్రంకుపెట్టీ—— రామ రామ యిలాంటి రాతియుగంనాటి 'నాగరికత' జీవితాన్ని ఈ మనిషెలా గడుపుతున్నాడో!

అంతలోనే రవణమీద కౌసల్యకు ఎక్కళ్ళేని జాలి పుట్టుకొచ్చింది. 'పాపం!' అనుకుంది. స్వయాన చెల్లెలికొడుకైనా నాన్నారు అతనికి తనతో సమానంగావుండే గదిని యివ్వకపోతే రవణేంచేయగలడు? పేరసైట్ పాపం! తనగదిలో డన్లప్పిల్లో పరుపులూ, డ్రెస్సింగ్ టేబిల్, గాడ్రెజ్ బీరువాలూ, సీలింగ్ ఫానూ——

తలుపుదగ్గర చప్పుడై వెనక్కి తిరిగి చూసింది. రవణ! వళ్లు చచ్చిపోయినట్టయింది. సంజాయిషీకి స్వరతంత్రులు అస్పష్టధ్వనుల్ని వుచ్చరించబోయేలోపునే, రవణ తలొంచుకొని లోపలికి వెళ్ళిపోయాడు.

చొక్కా బనియను విప్పుకున్నాడు. అప్పటిగానీ స్పృహ రాలేదు. భగవంతుడా, కాస్సేపుంటే ఫాంటూ అండర్వేర్ కూడా తన యెదురుగానే ఒలిచేసుకునేట్టున్నాడు! తడబడే అడుగులతో తనగదిలోకి వెళ్ళిపోయింది.

మర్నాడు సాయంకాలం కాలేజీ నుంచి బయటకు వస్తూంటే రవణ తారసపడ్డాడు. పక్కనేవున్న శారద కౌసల్యను మోచేత్తో పొడుస్తూ,

'మీ బావేవ్' అంది.

శారద యిందులో క్రొత్తగా డిస్కవర్ చేసిందేమీ లేదనుకుంది.

అంతలో ప్రసూన అందుకుంది——

'ఏవిటే ఆ సిరుకావి గుడ్డలూ, బీసీ చెప్పులూ వేసుకునే ఆ అందగాడే నేవిటే నీ కాబోయే రాకుమారుడు?'

చుట్టూవున్నవాళ్ళంతా లేవిడీ చేస్తున్నట్టు నవ్వారు. కౌసల్య తలనరికినట్లు బాధపడింది! ఎక్కళ్ళేని పౌరుషం ముంచుకొచ్చింది. ఏహ్యంతో ఒకసారి రవణ

వేపు చూసింది. ఛీ! సిగ్గులేని మనిషి — అతనికి సిగ్గూ లజ్జా లేకపోతే పోయె. అత నితోపాటు తననికూడా ఆ నీరుకావి గుడ్డల్తో హీనపరుస్తున్నాడు!

ఇంటికి రాగానే కురుక్షేత్రం తయార యింది. ఈ విషయమంతా పూసగుచ్చినట్టు కన్నీళ్ళతో తండ్రికి ఫిర్యాదు చేసింది. శేషాద్రిగారు రవణ రాగానే నరసింహావ తారం ఎత్తారు.

'కాలేజీలో చదువులు వెలగబెడుతు న్నావ్! ఆ మాత్రం డ్రస్‌మీద శ్రద్ధ వుండఖ్ఖర్లేదటయ్యా? కంపుబట్టల్తో క్లాస్ రూమ్‌లో కూచునేందుకు సిగ్గన్నా వెయ్యదా? బియ్యేలోకి వొచ్చికూడా శుచి శుభ్రతలమీద శ్రద్ధలేకపోతే యిహ నాచదువులు చదివెం దుకు?—'

ఈ నిందా వుపన్యాసాన్నంతనీ తలొంచు వినేసి 'సరే, ఇహ లోపలికి వెళ్ళి ఆ పాకీ బట్టలు విడిచేసెయ్' అన్న మంగళ వాక్యంతో, లోపలకు చెప్పుల్ని ఈడ్చు కొంటూ తన గుహలోకి వెళ్ళిపోయాడు రవణ.

ఆ చెప్పుల చప్పుడు కౌసల్య హృదిలో గణగణలాడింది. కడుపులో మరింత వికారం పుట్టుకొచ్చింది.

తన గదిలోకిపోయి ఆ రాత్రి తొమ్మిదిం బావు వరకూ ఏడుస్తూనే కూచుంది. ఎవరి మీదో కసి, జాలి; కోపం, ప్రేమ చిత్రాతి చిత్రంగా పెనవేసుకొని మదిలో మెదల నారంభించాయి. రవణ తన పాతగుడ్డల ఎగ్జిబిషన్‌తో తనని కావాలనే ఏడిపిస్తున్నా డనిపించింది. అలాంటి మనిషిని తను తెలిసి ఎలా క్షమించగలదు?


మనస్సులోని ఏడుపు నంతనీ ఏడ్చేసి, గుండె తేలికపడ్డాక హృదయంలో తార్కిక జ్ఞానం వుదయించ నారంభించింది.

పాపం! చినిగిన బట్టలూ, నీరుకావి గుడ్డలూ వేసుకున్నంతలో రవణ తనపట్ల అమానుషంగా ప్రవర్తించినట్టా లెఖ్ఖ? ఎదుటవాళ్ళ పేదరికాన్నో, బలహీనతనో, లోపాన్నో ఆసరాగా తీసుకొని అవహేళ నలు చేస్తూ తమ అల్పత్వాన్ని ప్రదర్శించు కుంటే అందుకు ఆ వ్యక్తినెందుకు శిక్షిం చాలి?

రవణ మాసిన మాసికల గుడ్డలు వేసు కోవడాన్ని తను ఏనాడూ అంతగా పట్టించు కోలేదు. కాని ఈవేళ వీళ్ళంతా కావాలని ఏడిపించేసరికి రోజూ చూసే ఆ మురికిబట్టలే ఆమెకు ఆగ్రహావేశాలను కలిగించాయి. రవణమీద తనకు కలిగిన కోపాన్ని, కసినీ తీర్చుకోవాలని కాదు నాన్నారితో ఫిర్యాదు చేయడం. స్నేహితురాండ్ర అపహాస్యాల నుంచి తనను తాను ఓదార్చుకోవాలనే!

కాని చిత్రం! నాన్నారు రవణమీద అంత యుద్ధం చేశారేగాని, సరే, రేపు బజా రుకి పోయి కొత్తగుడ్డలు కొనుక్కోమన్నా అన్లేదేం? అలా అన్నంతలో తను చేతి సాయం చేయాల్సి వొస్తుందేమో నన్న భయమేమో ఆయనకు!

అత్తయ్యను చిన్నప్పుడెప్పుడోచూసింది. ఒకానొకప్పుడు దాగా బతికినవాళ్ళేనట. కాని అంతా ఓ కలలా కరిగిపోయి చివరికి 'చిప్పా - జోలీ' స్థితికొచ్చేసి నాలుగు వేళ్ళూ నోట్లోకి పోవడమే ఓ బ్రహ్మ ప్రళయంలా రోజులు గడుపుకొస్తున్నారట!




రవణ అప్పటికే స్కూల్ ఫైనల్ ప్యాసయి ఆ ఊళ్ళోనే ఓ జమీందార్లాంటి పెదకాపుదగ్గర గుమాస్తాగా చేరి నాలుగు రాళ్ళు తెచ్చుకునేవాడట! అంతల్లో నాన్నారు ఏదో పనిమీద ఆ వూరెళ్ళడం, రవణ స్కూల్‌ఫైనల్ మార్కులు చూసి, అతన్నేదో వుద్ధరించేసేట్టు కాలేజీ చదువులు చదివిస్తానని యిక్కడకు తీసుకురావడం జరిగింది.

తీసుకురావడం వరకే తన బాధ్యతగా యెంచుకున్నారేమోగాని, తర్వాత రవణ నిత్యావసరాలకు ఏవిధంగానూ, ఎప్పుడూ తనకు తెలిసినంతవరకూ - సహాయం చెయ్యలేదు....

....తలచుకొనే కొద్దీ రవణమీద జాలే హెచ్చుకావొచ్చింది,

మర్నాడు, బ్యాంకులో తన ఎకౌంట్ లోనుంచి అరవై రూపాయలు తీసుకొని యింటికొచ్చింది. సాయంకాలం ఈపైకం ఎలా అయినా రవణ కందించాలనుకుంది. అది అందించేప్పుడు నాలుగు మాటలని మరీ యివ్వాలనుకుంది.

తీరా అతను ఏదో పనిమీద డాబామీది కొచ్చినప్పుడు, ఒంటరిగా వుండికూడా, అతన్ని పలకరించలేకపోయింది. పని ముగించుకొని అతను కిందికి దిగిపోతూం డగా వూపిరంతా బిగబెట్టుకొని పిలచింది!

'....రవణా....'

రవణ ఆగాడు.

తర్వాత ఏం మాటాడాలో కౌసల్యకు అంతుచిక్కలేదు. అతను ప్రశ్నార్థంగా చూశాడు. ఏదో ఒకటి మాటాడాలి.

మెల్లగా తడబడే అడుగుల్తో అతన్ని సమీపించింది. లక్షచీవాట్లు పెట్టి పైకిం యివ్వాలనుకున్న వేల అబలైపోయి చేతిలోని కవర్ని అతనికందించింది.

ఏవిటన్నట్టు చూశాడు రవణ.

'డబ్బు.... నీ బట్టలకూ....'

వాక్యం పూర్తికాకుండానే, కవరుజేబులో కుక్కుకొని కిందికి దిగిపోయాడు.

కౌసల్యకు మనస్సు చివుక్కుమంది. కనీసం 'థ్యాంక్స్' అనన్నా అనతేదేం? సిగ్గా? నిర్లక్ష్యమా? అసలా డబ్బు నిచ్చింది ఎవరనన్నా అనలేదేం? ఇదేం మనిషి?

వారం దినాలకూడా రవణ కొత్త బట్టలు వేసుకున్న జాడగానీ కొత్తబట్టలు కొనుక్కున్న ఛాయలుగానీ కనిపించలేదు. రోజూ అడగా లనుకుంటూనే వాయిదా వేసేసేది.

ఒకరోజున కాలేజీకి వెడుతుండగా పోస్టుమాన్ కార్డొకటి అందించిపోయాడు. రవణ అడ్రసుంది. సభ్యతకు వ్యతిరేకం అనుకుంటూనే కార్డంతా ఒక్కదూకులో చదివేసింది: రవణ వాళ్ళమ్మ వ్రాసింది: అతను పంపిన అరవైరూపాయలు అందినట్టు, కొడుకుని దీవిస్తూవ్రాసింది.

కౌసల్యకు అరికాలిమంట నెత్తికెక్కింది. బట్టలు కొనుక్కోమని డబ్బుయిస్తే, ఈ మనిషి ధర్మాలు చేస్తున్నాడా? కొస్తయినా బుద్ధీ, జ్ఞానం వున్నవాడైతే పరాయివాళ్ళు యిచ్చిన డబ్బుని యితరులకు పంపించుకుంటాడా? ఛీఛీ! .... ఈవాళ ఏమైనాసరే చీవాట్లు వేయాలనుకుంది.



సాయంకాలం కాలేజీనుంచి త్వరగా వచ్చేసి వరండాలో కూచుంది. ఈ సారి అతని మీద దాక్షిణ్యం చూపదలచుకోలేదు. ఇంట్లోకి వచ్చేవాణ్ణి వస్తున్నట్టే ఛడామడా అనేస్తే, ఆ కేకలకు నాన్నారూ, అమ్మా బయటకు రావడం, విషయమంతా వాళ్ళకు చెప్పి వాళ్ళచేతకూడా నాలుగు మాటలనిపించి అతనికి బుద్ధొచ్చేట్టు చెయ్యాలి.

రవణ సరిగ్గా ఆరు గంటలకు ఇంటికి చేరాడు. కుంటుకుంటూ యింట్లోకివచ్చాడు.

అంతలోనే శేషాద్రిగారు గదిలోంచి బయటకు వస్తూ కుంటుతున్న మేనల్లుణ్ణి చూసి –

'అదేం?' అన్నారు.

'మేకు గుచ్చుకుంది.'

'చెప్పులు వేసుకెళ్ళలేదా?'

'చిరిగిపోయాయి'–అని క్లుప్తంగా అనేసి తన గుహలోకి పోబోయాడు.

కౌసల్యకు వళ్ళు మండుకొచ్చింది:

'కొత్తచెప్పులు కొనుక్కుంటే ఈ తిప్పలుండేవి కాదుగా....'

రవణ వో క్షణం ఆగి మళ్ళా ముందుకు సాగిపోయాడు.

తెల్లవారేసరికి రవణ కాలు యింతలావున వాచిపోయింది. కాలుతీసి కాలు తియ్యడమే వో బ్రహ్మాండంలా కాలేజీకి కుంటుకుంటూ బయలుదేరాడు.

సగం దార్లో రిక్షాలో ఎదురైన కౌసల్య ఈ కుంటివాణ్ణి చూచి మరింత అసహ్యించుకొంది. మంచిపనైందని మనసులో శపించుకొని – శపించుకున్నందుకు ఆ తర్వాత బాధపడింది.

జ్యోతి

సాయంకాల మయేసరికి రవణకి కాలు వాపుతోబాటు టెంపరేచర్ కూడా వచ్చింది. ఈ తెచ్చిపెట్టుకున్న తద్దినానికి శేషాద్రిగారు నాలుగైదుసార్లు దెప్పిపొడిచారు.

దెప్పినంతలో జ్వరాలు తగ్గి పుండు మాన్తుందా అంది కౌసల్య. మనస్సులోని సానుభూతి నంతనీ పైకి కనబరిస్తే యింట్లో వాళ్ళందరూ తనని చిత్రంగా చూడొచ్చు వనే భయం కౌసల్యకు లేకపోలేదు. ఆ నాలుగైదు దినాలూ కాలేజీకి వెళ్ళిందేగాని మనస్సుమాత్రం రవణ గదిలోనే విడిచి పెట్టేసేది. ఇంటికి వచ్చీరాగానే చిన్న చెల్లాయిని—

'రవణ కెలా వుందే యిప్పుడు?' అని అడిగేది ఆతృతగా - సమాధానం అననుకూలంగా రాగూడదని వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూనే.

వారం దినాలకు ఇరవైలక్షల పెన్సిలిన్ తోనూ, పాతిక రూపాయల ఖర్చుతోనూ జ్వరం పూర్తిగా తగ్గింది. గాయంమాత్రం కొద్దిగా వుంది.

ఆ వాళ సాయంకాలం వరండాలో కూచుని పుస్తకం చదువుకుంటున్న రవణని చూడగానే కౌసల్యకు ప్రాణంలేని వచ్చినట్టనిపించింది. 'హమ్మయ్య' అనుకుంది.

సరిగ్గా అదే సమయంలో రవణ తలెత్తి చూడటం, కౌసల్య హృదయపూర్వకంగా చిరునవ్వు నవ్వడం, రవణ కుర్చీలోంచి లేచిపోయి మెల్లగా తన గుహలోకిపోవడం ఒక్క క్షణంలో జరిగాయి.

కౌసల్య ఆనందం, ఆతృత, ఉల్లాసం - చప్పున చప్పబడిపోయి భూమిలోకి కూరుకుపోయినట్టు బాధపడింది.

తనని చూస్తే చాలు, రవణ కెందుకింత నిర్లక్ష్యభావం? తనేం చేసింది? ఎప్పటికప్పుడు అతని బాగోగుల గురించి ఆరాటపడే తన నెందుకిలా బాధిస్తాడు? అంత పెడసరమా మనిషికి?

గదిలోకిపోయి రెండు తావుల ఉత్తరం రాసింది. రాసినదాన్ని రెండు మూడు సార్లు పునర్విమర్శతో చూసుకుంది.

ఉత్తరాన్ని మడిచి పెద్ద కవర్లో పెట్టి రవణ గుహవేపు వెళ్ళింది.

చాపమీద పడుకొనివున్నాడు. ద్వారం దగ్గర చప్పుడువిని తలెత్తిచూశాడు. కౌసల్య చేతిలోని కవర్ని వొక్కసారి అతనిమీదికి గిరవాటేసి, గబగబ అడుగులేసుకొంటూ వెళ్ళిపోయింది.

నీలిదీపం వెలిగించి గదిలో ఈజీఛైర్‌లో పడుకుంది. నిద్ర రావటంలేదు. ఏమైనా ఈవాళ తెల్లార్లూ మెలకువగా వుండాలనుకుంది.

ఉత్తరాన్ని చదువుకున్నాక రవణకు సిగ్గూ జ్ఞానదృష్టి అలవడుతుందని, దాంతో అతను తారెత్తిపోయి తనముందు మోకరిల్లి క్షమాభిక్ష వేడుకుంటాడని భావించింది. ఆ భావనతోనే కళ్ళు మూతలు పడిపోతున్నా బలవంతంగా రెప్పలు తెరచుకొని రెండింటివరకూ మెలకువగా వుంది. ఎక్కడే మూల చిన్న చప్పుడు వినిపించినా రవణే

---

ఒక రామకృష్ణగారు వూరికి వెళుతూవుండగా, ఆయనభార్యను పొరుగింటావిడ అడిగింది. "ఐతే మరి మీవారొచ్చేదాకా మీరేం చేస్తారు ఒక్కరూ?"

"ఏం చేస్తానూ - వారొచ్చేదాకా రామా కృష్ణా అంటూ కూచుంటాను"

వస్తున్నట్టూ. ఎక్కడే అలికిడి తగిలినా రవణే క్షమాపణ వేడుకుంటున్నట్టూ వూహించుకొనేది .... రెండింటివరకూ ఎలకల్నీ, పిల్లినీ తిట్టుకొంటూ – తర్వాత యెలా నిద్రపోయిందో తనకే తెలీదు.

నిద్రలో చంపుకు తిన్నాడు రవణ. క్షమించమంటూ కాళ్ళు పట్టుకుంటే సత్యభామలా అతని తలమీద తన్నినట్టూ, తన కాళ్ళ కెక్కడ నొప్పితగిలిందో అన్నట్టు కాళ్ళు రవణ పట్టడమూ, అయినప్పటికీ తాను క్షమించకపోవడం... తెల్లవారే సమయానికి ఈ కలాపం క్లయిమాక్స్‌కి వచ్చి-రవణ విసుగెత్తిపోయి తనని బలంగా కావలించుకొని ముద్దుపెట్టుకున్నట్టూ.

కంగారుపడి లేచింది. లేచిన అయిదు నిమిషాలవరకూ- ఆ స్వాప్నిక పరిష్వంగం తనలో కలిగించిన అనుభూతిని నెమరువేసుకుంటూ స్తబ్ధంగా వుండిపోయింది.

బద్ధకంగా వొళ్లు విరుచుకొని లేవబోయేసరికి కీళ్ళనుంచీ, కాళ్ళనుంచీ నొప్పులు మొదలయ్యాయి. కళ్లమంటలు; కడుపులో తిప్పడం; వాంతి అయ్యేట్టు ముందుకుతూలి తమాయించుకుంది.

రమణ కాని తను నిద్రపోయాక యిటు వేపు వచ్చి చూశాడేమో? ఉత్తరం లాంటిదేదయినా సమాధానంగా గాని వొదిలిపెట్టి వెళ్ళాడేమో! గుండెలమీద మొట్టమొదటిసారిగా వెదికి చూసుకొంది. అలా వెతుక్కుంటూనే సిగ్గుపడింది; తన పిచ్చిగాని, ఉత్తరాన్ని తన గుండెలమీద పెట్టగలిగేంత ధైర్యముందీ రవణకు?

రవణను తనుగాని ప్రేమిస్తున్నదేమో అనిపించింది ఎందుకో! లక్ష అగ్నిపర్వతాలు బద్దలైనంత కల్లోలం జరిగింది మనస్సులో.... ఆ సంక్షోభం నుంచి తప్పించుకునేందుకు ఆవాళ మేటినీకిప్రసూన, శకుంతలతో కలసి ఏదో పిక్చరుకి వెళ్ళింది.

చిత్రం చూస్తున్నంతసేపూ తలనొప్పి బాధనూ: కౌసల్య చీకాకుని కనిపెట్టి—

'అలా వున్నావేవిఁటే' అనడిగింది శకుంతల

ఏం లేదని చెప్పేలోపునే ప్రసూన అందుకుంది 'విరహతాపమేమో!'

'ఎవరోయ్ ఆ అభాగ్యచక్రవర్తి!'

'ఉన్నాడుగా అపర పిసినిగొట్టేశ్వరుడు: రమణరావ్—'

కౌసల్యకు చిరాకేసింది. మనుష్యుల్ని గాయపరచడమే వీళ్ళకు ఆనందంలాగుంది! నేరకపోయి వీళ్ళతో కలసి పిక్చరు కొచ్చాననుకుంది!.... వాళ్ళ హాస్యాలింకా తారస్థాయికి పోవడంతో యిహ భరించలేక యింటికి పోవాలని సీట్లోనుంచి గప్పున లేవడం ఇంటర్‌వెల్ అయి హాల్లో లైట్లు గప్పున వెలగడం ఒకేసారి జరిగాయి.

శకుంతల కెవ్వున కేకపెట్టింది! 'అదుగోనేవ్ మీ రవణరావ్ కింద పదణాల క్లాసులో వున్నాడు!' అంది బాల్కనీనించి కిందికి చూస్తూ.

చూడగూడదనుకుంటూనే కిందికిచూసింది కౌసల్య. నిజంగానే రవణ! ప్రసూనవూరుకోలేదు.

'అదేవిఁటే బావగార్ని పదణాల థర్డ్ క్లాసులో కూచోబెట్టేశావ్?'

'డబ్బు లివ్వలేదట్టుంది. పాపం!'

'ఇప్పట్నుంచే కంట్రోల్ చేసేసుకుంటున్నావేవిఁటే?'

ఇలా సాగిన వెక్కిరింతలు కౌసల్య పిచ్చికేకతో తక్కున ఆగిపోయాయి. ఆశ్చర్యాన్నభినయిస్తున్న స్నేహితురాండ్రను ఆ స్థితిలోనే వొదిలేసి గిర్రున తిరిగిపోయి యింటికి రిక్షాచేయించుకొని వెళ్ళిపోయింది.

వరండాలో కూచుని వున్న తండ్రిని చూడగానే దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. కారణం తెలీని శేషాద్రిగారు ఆమెను వూరడించడానికి శత ప్రయత్నాలు చేసి అసలు విషయాన్ని తెలుసుకున్నాక వుగ్రరూపాన్ని దాల్చాడు.

నిన్నమొన్నటివరకూ కాలు సెప్టిక్కని ఇంత చేతి చమురొదిలించాడు- అప్పుడేసినిమాలకు కుంటి కాలీడ్చుకుంటూ తయారయాడూ!' ముక్కుమీద వేలేసుకున్నంత పని చేశారాయన.

'అక్కడికి మనకేదో గతిలేనట్టు నా ఫ్రెండ్స్ ముందర పదణాలక్లాసులోకూచుని నన్ను నలుగుర్లో నూ సిగ్గుపరచాడు...' అంది కౌసల్య వెక్కి వెక్కి ఏడుస్తూ. చివరకు తన మనసులోని బాధనంతట్నీ వెళ్ళగక్కింది. 'ఇహ ఈ యింట్లో అతనన్నా వుండాలి. నేనన్నా వుండాలి.. నిర్ణయించుకోండి! ఎవరు మీకు ముఖ్యమో' అన్నట్టు తండ్రివేపొక చూపు విసిరింది.

కూతురువేపు ఆశ్చర్యంగా చూశారు శేషాద్రిగారు!

'సరే అతన్ని యింటికిరానీయ్, అడిగి.'

'అడగడాలు, కడగడాలు అనవసరం నాన్నా! ఇప్పటికే అతన్ని చాలవరకు క్షమించగలిగాను.' అంటూ తను రవణకిచ్చిన అరవైరూపాయల విషయం, ఆ డబ్బుని అతను వాళ్ళమ్మకు పంపించుకున్న వైనం వివరంగా చెప్పి అతనిమీద శ్రోతకు ఏహ్యం, కోపం కలిగేట్టు చేయగలిగింది.

రవణ యింటికి చేరుకునేసరికి సరిగ్గా ఏడున్నర అయింది.

'ఎక్కణ్ణుంచి రావడం?' -దాదాపు అరిచినంత పని చేశారు శేషాద్రిగారు.

రవణకు ఈ పొలికేక ఆశ్చర్యాన్ని కలిగించింది. వింతగా మామగారివేపు చూడమొదలుపెట్టాడు. అతని వెనకాలవున్న కౌసల్యముఖం చూచేసరికి ఏదో చిత్రమే జరిగివుండొచ్చనుకున్నాడు.

'నిన్నే. ఏం మాటాడవ్?'

'పిక్చరు కెళ్ళాను'

'పరీక్ష లెప్పట్నుంచి?'

పరీక్షలకూ పిక్చరుకీ లంకె పెట్టడంతో- కౌసల్యవల్ల ఏదో దుర్బోధ జరిగివుండవచ్చనుకున్నాడు. తను ఫస్ట్ క్లాసులో పాసయేవాడని తెలిసుండి గూడా ఆయనీ ప్రశ్న వేయడంలో అంతరార్థం మరొకటేదో అయివుండొచ్చు.

'నీకు ఈమధ్య చదువులమీదా, పుస్తకాల మీదా ధ్యాసవుండటంలేదు. అమాత్రం దానికి వేనకువేలు గుమ్మరిస్తూ నిన్నిలా ఎందుకు చదివించాలో అర్థంకావటం లేదు. ఇహనుంచి నువ్వా చదువులు చదవనూ వద్దు, మా యింట్లో వుండనూ అవసరం లేదు. ఈ పరీక్షేదో అయిపోయాక నీ దారి నువ్వు చూచుకో–'

---

● ఎయిర్ కండీషన్డ్ ఆఫీసుల్లో పనిచేసేవాళ్ళు "చెమటోడ్చి పని చేస్తున్నాం" అని చెప్పుకోడానికిలేదు!

నెత్తిన పిడుగు పడ్డట్టు సంభ్రమాశ్చర్యాలతో కళ్ళప్పగించి చూస్తూ నిలబడిపోయాడు. ఇంత పెద్ద శిక్ష విధించడానికి తను చేసిన నేరం సినిమాకు వెళ్ళడమే అన్నదాన్ని అతని మనస్సు అంగీకరించడం లేదు.

'ఈ పరీక్ష అయిపోయే వరకూ కాదు, తక్షణమే వెళ్ళిపోవాలి!' అని అరచింది కౌసల్య. శేషాద్రి గారు ఆమె వేపు చూశారు.

రవణకు విషయం అర్థమయింది. ప్రోత్సాహం కౌసల్యది; పరికరం శేషాద్రి. 'అతను వుంటే అతనన్నా వుండాలి; లేదా నన్ను బయటకు పంపించేసెయ్యండి'.

ఇంత కఠోరమైన శపథం పట్టడానికి కౌసల్యకు కారణాలు ఏవైనా కావచ్చు. వాటిని తెలుసుకోవాలనుకోవడం, తర్కించుకోవాలనుకోవడం అవివేకం. నాలుగేళ్ళుగా తన మీద నిష్కారణమైన పంతాలని చూపిస్తూ, కనిపిస్తే చాలు కసురుకునే కౌసల్య చివరి కోనాడు ఇలాంటి స్థితిని తెచ్చిపెడుతుందని అతను ముందుగానే వూహించుకున్నాడు. అందుకు సిద్ధంగానే వున్నాడు. కాని ఆ పరిస్థితి యింత చిన్న విషయం మీద ప్రాప్తమవుతుందని వూహించలేకపోయాడు.

ఒక నిట్టూర్పే అంగీకారంగా లోపలికి వెళ్ళబోయాడు.

ఆ నిట్టూర్పుకి కౌసల్య మరింత కసిగా అరచింది:

'ఇప్పుడే తక్షణం యిల్లువిడచి వెళ్లాలి' అడ్డు చెప్పబోయిన తండ్రిని విదుల్చుకొని — 'మీరు మధ్యకు రాకండి_' అని గదిలోకి పోయి పరుపుమీద వాలిపోయింది.

అరగంటలో, రవణ తన 'లగేజి' నంతటినీ సర్దేసుకున్నవార్తని చిన్నతమ్ముడు మోసుకొచ్చాడు.

మంచం మీదనుంచి చివాల్న లేచి పరుగు నడకల్తో ద్వారం దగ్గరకు వచ్చింది. నిజంగా రవణ వెళ్ళిపోతున్నాడా? అతని గది వేపు చూసింది. అలికిడి లేదు. వెళ్ళిపోయాడేమో! కడుపులోని దుఃఖం మరింత ఉవ్వెత్తుగా వచ్చేసింది. కాదు! రవణ వెళ్ళిపోకూడదు.... ఈ కురుక్షేత్రానికంతకూ తనే కారణం.... ఇక ఆలస్యం చేయకూడదు. కళ్ళు తుడుచుకొని రెండడుగులు ముందుకి వేసింది. రవణ గదిలోనుంచి బయటకు వచ్చి డాబామీదికి వెళ్లాడు.

ఇదే సమయమనుకొని అతని వెనకాలే గబగబ వెళ్ళింది.

డాబామీద ఎండబెట్టిన తువాలు తీసుకొని రవణ కిందికి దిగబోయాడు. మెట్లమీద ఎదురైన కౌసల్యను చూడగానే అతను చప్పున చలించిపోనూలేదు; ఆశ్చర్యపడనూ లేదు. జేబులోనుంచి రెండు కవర్లు తీసి ఆమె దగ్గరగా వచ్చి అందించాడు.

కవర్లు రెండూ కౌసల్య చూసుకుంది. ఒకటి రాత్రి తను అతనికి వ్రాసిన కవరు. రెండోది -

'మీరు నన్ను బట్టలు కొనుక్కోమని యిచ్చిన అరవై రూపాయలు', అన్నాడు. రవణ క్లుప్తంగా.

రాత్రి తను వ్రాసిన కవరు విప్పి చదువుకున్నట్టులేదు_

'అసలు చదువుకోలేదు' అన్నాడు రవణ మెల్లగా 'అందులో ఏమిటి వ్రాసి వుంటుందో నాకు తెలిసినపుడు, తీసి చదువుకోవడం అనవసరమనిపించింది.' అని వో క్షణమాగి_

'నా స్థితికి జాలిపడి మీరుయిచ్చిన అరవైరూపాయలకు ఆనాడే కృతజ్ఞతను తెలపలేదు. కారణం: ఎప్పుడో వొకప్పుడు యిదేపైకాన్ని తిరిగియివ్వాల్సి వుంటుందని వూహించుకున్నాను.... బహుశః ఈ వూహలో నా తప్పువుంటే నన్ను క్షమించండి_'

కౌసల్య రెండు కళ్ళనిండా అశ్రువులు నిలిచాయి. ఇక ఆపుకోలేని స్థితిలో అవి స్రవంతిలా వక్షస్థలి మీదికి స్రవించాయి.

'నన్ను 'మీ' రని పిలిచి యింకానన్ను యేడిపించకు రవణా_' అంది కౌసల్య— స్వరతంత్రుల్ని చుట్టుముట్టిన కన్నీళ్ళని విదిలించుకొంటూ.

ఆమె బేలతనానికి రవణ వేదాంత ధోరణిలో నవ్వుకొని వుండొచ్చు.

'ఏవిధంగా సంబోధించమన్నా నాకు అభ్యంతరం లేదు. ఎంత కాదనుకున్నా కౌసల్య ఎవరని ఎవరన్నా అడిగితే మా అమ్మ అన్నగారి కూతురనుకుంటామేగాని, నన్ను పురుగుని చీదరించుకున్నట్టు అసహ్యించుకొనే శ్రీమంతురాలని అనగలనా?'

రవణ చెప్తున్నాడని కౌసల్య మరింత కుళ్ళికుళ్ళి ఏడ్చింది.

'నన్ను క్షమించు రవణా'

'ఎందుకు'

'దీనికంతకూ నేనే కారణం'

'ఆ విషయం నాకు తెలుసు.'

'విన్నావా?'

'ఊహించాను.'

కిందికి వెళ్ళిపోబోయాడు. కౌసల్య చప్పున అతనిచేతిని పట్టుకుంది. పట్టుకున్న మనిషి తనవాడన్న భావం అప్పుడే కలిగింది. అదే పిడికిలిని అతనిబుజాలమీదుగాపోనిచ్చి అతని ముఖంలో ముఖంపెట్టి - క్షమించానన్నవరకూ విడవను అనాలన్న పిరికి పట్టుదల వచ్చింది.

రవణ, తనముంజేతిని 'కావలించుకున్న' కౌసల్య కోమల హస్తాన్ని విమర్శనాపూర్వకంగా చూశాడు. ఈ అబలకు యింత కోపంతోపాటు, అంత బేలతనాన్నికూడా ప్రసాదించిన సృష్టిశక్తిని కసిదీరా శపించుకున్నాడు!

'నువ్వెక్కడ తప్పు చేశావో తెలుసుకోకుండా మరో తప్పు చేయడానికి సాహసిస్తున్నావ్ కౌసల్యా'

చప్పున చెయ్యి దించేసుకుంది.

'నన్ను వెళ్ళనీయ్.'

'వీల్లేదు'

'ఆ హక్కు నీకు ఎప్పుడో పోయింది.'

'అది పొందేందుకే క్షమించమంటున్నా రవణా'

'అభిమాన మనేది నాక్కూడా కొద్దిగా వుంది.'

'దాంతోపాటు వివేకం కూడా వుంది నీకు.'

'నీకు లేదా?'

మౌనంగా తలూపింది_ చర్చలుతగ్గించే భావంతో.

'అయినప్పుడు నన్ను క్షమించమని అడగడంలో అర్థంలేదు.' అని ముందుకి సాగాడు.

కౌసల్య రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని బోరుమంది. రవణ హృదయంలో వో తృటిపాటి భావసంచలనం బయలుదేరింది. ఇప్పుడు తనామెను క్షమించి ఏమిచెయ్యటం?

ఆగి వెనక్కి వచ్చాడు.

'ఇలా యేడవడం ఎవరో సంస్కారం లేని వాళ్ళు చేయాల్సినపని' అన్నాడు సగం అధికారయుక్తంగా.

'నాకు నిజంగానే సంస్కారం లేదు.' అనుకుంది. అనుకున్న నగ్నసత్యాన్ని పైకి కూడా అనాలనుకుంది. కాని రవణ మాటల్తో ఆమె నిశ్శబ్దమయింది.

'ఒక విషయం దాచకుండా చెబుతావా?' ఏవిఁటన్నట్టు చూసింది.

'నువ్వు నన్ను ప్రేమించటంలేదుకదూ?'- ప్రశ్నను కావాలనే నెగిటివ్ లో వేశాడు ఆమె రియాక్షన్‌ని కనిపెట్టాలని.

కౌసల్య చప్పున తలెత్తి చూసింది. సమాధానాన్ని గుండెల్లో మూలమూలలా వెతుక్కోనారంభించింది.

'అమ్మ నా చిన్నతనంలో అంటూండేది: 'శేషాద్రి అన్నయ్య కూతుర్ని వీడికిచ్చి పెళ్ళిచెయ్యా'లని. కాని ఈ శేషాద్రిగారెవరో, ఆయన కూతురెలా వుంటుందో నాకప్పుడు తెలీదు. తెలుసుకోవాలనే తాపత్రయం కలిగిన్నాటికి అమ్మ ఆమాట అనటం మానేసింది. మాకా తాహతూ, హోదా పోయాయని తెలుసుకున్ననాటి నుంచి మీగురించే మరచిపోయాను.

ఒకనాడు మావఁయ్య వచ్చారు. నన్ను పట్నం తీసుకవెడతామన్నపుడు నాకు మొట్టమొదటిసారిగా కనిపించింది కాలేజీ కాదు; డిగ్రీకాదు: షోకులుకాదు: పట్నం షికార్లు కాదు - ఒక చిన్న అమ్మాయి జ్ఞాపక మొచ్చింది. పేరేవిఁటో తెలుసా? కౌసల్యట.

'ఆ కౌసల్య చుట్టూ జీవితాలూ, ఆనందాలూ, సంతోషాలూ అల్లుకోనారంభించాను, ఆమెతో కలసి సరదాగా కాలేజీకి పోవడాన్ని, కలసి సినిమాలకు పోవడాన్ని, కలసి ఇంట్లో ఒకే టేబిలుముందు కూచుని చదువుకోడాన్ని - ఇంకా ఇంకా ఎన్నోఎన్నో తియ్యగా వూహించుకొన్నాను.

'ఇక్కడి కొచ్చాను. నేను వూహించుకొన్న కౌసల్య ఆ కౌసల్య కాదనిన్నీ, నన్ను అనుక్షణం అసహ్యించుకొంటూ దూరంగా పోతున్నదనిన్నీ, నామీద చాడీలు చెప్పియితరుల దృష్టిలో ఇడియట్‌గా నన్ను మార్చిపారేసిందనిన్నీ తెలుసుకున్నాక నేను పడిన బాధ, దుఃఖం - కౌసల్యా నీకు చెబితే అర్థంకాదు; నువ్వు అర్థంచేసుకోలేవు. ఈబాధ ఒకనాడు కాదు; రెండ్రోజులు కాదు - నాలుగేళ్ళు భరించి భరించి ఎంత పిచ్చివాణ్ణయిపోయానో నీకు తెలీదు. ఒక పల్లెటూరి అమాయక ప్రాణిని, అర్భకుణ్ణి - నా అమాయకత్వానికి నవ్వుతూ, నా 'అజ్ఞానాని'కి అపహాస్యాలుచేస్తూ, ఉడికిస్తూ రెచ్చగొట్టే మాటలాడినపుడు - నాకా్కవాలనుకున్న, నేను వూహించుకున్న అందమైన సుందరాంగి ఎందుకు నానుంచి యింత దూరంగా పోతోందో అర్థంగాక నేను పడిన ఈ నాలుగేళ్ళ యమయాతన - కౌసల్యా - నువ్వు వింటే గుండాగి చచ్చిపోతావ్! నన్ను వెలివేసినట్టు ఈయింట్లో అందరూ విడిగా చూస్తున్నప్పుడూ, నా ఒక్కడికే విస్తట్లో (మిగిలిపోయిన వంటకాలు) వడ్డిస్తున్నప్పుడూ నేను పడిన బాధ పగవాడికి కూడా వద్దు. ఈ బాధనుంచి మోక్షణం బయటపడాలని, ప్రపంచంలోకి ఒకఘడియ పోతే - దాన్నికూడా నేను చెయ్యరాని నేరంగానే పరిగణించేదానవ్. కాలికి మేకు గుచ్చుకున్న బాధకంటే, దానికి లక్షలై పోతున్నట్టు యింట్లోవాళ్ళనే మాటలు ములుకుల్లా గుచ్చుకొనేవి. ఆవారం పదిరోజులు ఈ దెప్పులబాధనుంచి కాస్త శలవు పుచ్చుకొనేందుకు యీవాళ సినిమాకు వెడితే పర్యవసానం యిది-!'

కోటికోట్ల సంవత్సరాలుగా భూగర్భంలో కళపెళ మరుగుతున్న లావా వొక్కసారిగా అదను చూసుకొని జ్వాలాముఖి ముఖ ద్వారం గుండా విజృంభించినట్టు రవణ విజృంభించడంతో కౌసల్య ఖిన్నవదనయై సిగ్గుః సంక్షోభాలతో మరింత కుదించుకపోయింది.

'అమ్మకు పంపించిన అరవైరూపాయలూ నువ్వునాకు యిచ్చినవే అనుకున్నావ్. కాని ఈ మూడునాలుగేళ్ళ నుంచి కూడా అమ్మకు నేను నెలనెలా అలా పది పాతికా పంపిస్తూనే వున్నాను. సాయంకాలమప్పుడు రెండు ప్రైవేట్లు చెప్పుకొంటూ ఆ డబ్బు సంపాయించి వాళ్ళకు పంపిస్తున్నట్టు మీకు చెప్పకపోవడం నా తప్పే. కాని చెప్పడంవల్ల మరో సమస్య తలెత్తుతుంది. దాన్ని మీరు మోసమన్నా ఫర్వాలేదు.

అని ఒకనిట్టూర్పు విడిచి మళ్లాఅన్నాడు.

'ఒకళ్ళమీద అధికారం చెలాయించాలన్న మానసిక వక్రత్వాన్ని నువ్వు దిన దినం వృద్ధిచేసుకుంటున్నావ్ కౌసల్యా. అందుకు డబ్బు బాగా మద్దత్తు నిచ్చింది. నీ మనస్సులో ఎక్కడో నామీద ఎవరూ మార్చలేని నిష్కలంకమైన ప్రేమ వుంది. దాన్ని బైటికి నీమటుకు నువ్వు చెప్పుకోడానికి అహం అడ్డొచ్చేది. ఇక్కడే నువ్వో రకమైన అడ్డగోడల్ని సృష్టించుకున్నావ్. నేనుఫక్తుపల్లె ఘటాన్నని నాబాహ్యావతారాన్ని చూసి అసహ్యించుకోవారంభించావ్. ఓ శుభముహూర్తాన నన్ను టెర్లిన్ షర్టుల్లో, ట్రాపికల్ పాంటుల్లో చూసుకోవాలని అరవై రూపాయలు యిచ్చావ్. దానికి కూడా నేను తలవొంచక పోవడంతో నీ అతిశయానికి హద్దులు తెగి నన్ను 'చిత్రవధ' చేయడానికి నిశ్చయించుకున్నావ్...ఈడబ్బు సృష్టించిన కృతకవాతావరణంలోంచీ డబ్బులేని నన్ను చూసి నీతోసమానంగా నేనురాలేకపోతున్నానని జాలిపడి, ఆజాలిని కోపంగామార్చుకొని నన్నుహింసించేదానవ్, ..అలాటి బలహీనత గల స్త్రీని, ఏకారణం చూపించి నన్నుస్వీకరించమంటావ్ కౌసల్యా,?'అన్నాడు రవణ.

నిశ్శబ్దం!

ఆకసం నించి ఒక ఉల్క రాలిపడింది. మిణుకు మంటున్న నక్షత్రాలు ఒకసారి కళ్ళు మిటకరించి డాబా మీది రెండు ప్రాణుల్ని రెప్పవాల్చకుండా చూడనారంభించాయి. కోపమొచ్చి కోయిలమ్మ ఆవులించి, ఆలాపించింది. గోదావరి గోలపెట్టి షీంకరించింది. దూరాన రైలుబండి బ్రిడ్జి మీద కూతకూసింది.

రవణ వుపన్యాసంలో అర్థంలేదనిగానీ, వున్నా తను గ్రహించలేకపోయాననిగానీ, కౌసల్య వూహించుకోలేదు. ఊహించేందుకు ఆమె మస్తిష్కం తిరస్కరించింది. ఆమెకు చేతనైనదల్లా ఒక్కటే: కుప్పలా రవణ కాళ్ళమీద పడిపోయి అశ్రువులతో అభిషేకంచేసి అస్పష్టంగా! 'క....మి....ం.... చ....ం....డి....' అంది.

రవణ అక్కణ్ణుంచి కదిలిపోయినపుడు ఆ పాదధూళి కౌసల్య తలమీద వేసుకుంది-

● ● ●

రవణ, ఆ వెళ్ళడం తిన్నగా స్నేహితులింటికి ఇక్ష్వాకులనాటి ట్రంకుతోనూ, బీసీ బెడ్డింగ్‌తోనూ వెళ్ళిపోయాడు,

కథంతా విన్న మిత్రబృందం సాముహికంగా రవణ్ణి 'ఇడియట్, ఫూల్, జంగ్లీ, అడివిమృగం' అని తెలిసిన భాషల్లోని, తెలియని తిట్లుకూడా తిట్టేశారు.

అన్నింటినీ శిరసావహించిన రవణ మెల్లగా:

'అమ్మకు ఉత్తరం యిప్పుడే వ్రాసి పోస్ట్ చేశాను: పరీక్షలయిన వెంటనే ముహూర్తం నిశ్చయించడానికి మావఁయ్యదగ్గరకు రమ్మనమని' అన్నాడు చిరునవ్వుతో. □□□